**జరిగిన కథ :** కన్యాకుబ్జ యువరాజు పుష్పకేతుడితోపాటు అతని నలుగురు సోదరులూ.. తమిళ దేశంలోని స్త్రీ రాజ్యానికి వెళ్లారు. అనుకోకుండా ఒకరోజు అతని తమ్ముళ్లు నలుగురూ కనిపించకుండా పోయారు. వాళ్లను వెతుకుతూ.. పుష్పకేతుడు ఆ రాజ్యపు రాణిని పెళ్లాడాడు. ఆ కొలువులో తన ముందుకు వచ్చిన రెండు హత్యాపరాధాలపై విచారణ చేపట్టాడు.






# కుందమాల తల్లి


అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**


"ఏమయ్యా! నీ అభియోగం ఏమిటి?" అని ప్రశ్నించాడు పుష్పకేతుడు.

"మహారాజా! నేను వ్యాఘ్రముఖి అనే వారకాంత తమ్ముణ్ని. మా అక్క కులవృత్తి చేత చాలా ధనం ఆర్జించింది. మొన్న ఒక విటుడెవ్వడో తన కూతురైన కుందమాలను వశం చేసుకుని, మా అక్కను చంపి నూతిలో పారేశాడు. అడ్డం వచ్చిన వారిని కూడా హతమార్చాడు. మా మేనకోడలు కుందమాల వాడికి జడిసి వరించిందో.. ఏమో తెలియదు కానీ, తల్లిని చంపిన వాడనే విచక్షణ లేకుండా వాడితోనే కులుకుతున్నది. అందువల్ల నేనే ఈ అభియోగం తెచ్చాను. వాడు మీ ఆజ్ఞాపత్రిక పుచ్చుకుని కూడా విచారణకు హాజరు కాలేదు. మీరే మాకు న్యాయం చేయాలి" అని వేడుకున్నాడు వాదిగా వచ్చినవాడు.

"వాడినిప్పుడే బంధించి తీసుకురండి" అని భటులను ఆజ్ఞాపించాడు పుష్పకేతుడు.

ఇంతలో మణిమంతుడు తిరిగి వచ్చాడు.

"దేవా! మా అల్లుడు చాలా అలసిపోయి ఉన్నాడు. ఇప్పుడు రాలేనని తమతో మనవి చేయమన్నాడు" అని చెప్పాడు.

ఆ మాట వింటూనే పుష్పకేతుని ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

"వాణ్ని కూడా వెంటనే బంధించి తీసుకురండి" అని మరికొందరు భటులను పంపాడు.

రెండువైపులకూ వెళ్లిన భటులు తిరిగి వచ్చారు.

"మహారాజా! వాళ్లను బంధించడం మా వల్ల కాలేదు. వారి కత్తికి బదులివ్వడం మాకు సాధ్యం కాలేదు" అని సమాచారం ఇచ్చారు.

పుష్పకేతుడు ధూమకేతునిలా మండిపడ్డాడు.

"ఓహో! ఈ రాజ్యపౌరులకు మా సామర్థ్యం చాటి చెప్పాల్సిన సమయం వచ్చినట్లుంది" అని కత్తిదూసి బయల్దేరాడు.

సభలోనే ఉన్న అతని తమ్ముడైన పింగళుడు కూడా అన్నను అనుసరించాడు. వారికంటే ముందుగా అల్లుడి వద్దకు వెళ్లిన మణిమంతుడు ఎన్నోవిధాలుగా అతణ్ని బతిమాలాడు.

"ఉత్తిపుణ్యానికి రాజుతో విరోధం మంచిది కాదు. ఆయన చాలా మంచివాడు. మన పక్షానే ఉన్నాడు. ఒక్కసారి ఆయన దర్శనం చేయి" అని ఎంతగానో చెప్పిచూశాడు.

కానీ, ఆ మాటలు అతని చెవులకు ఎక్కలేదు.

"మామా! నా భుజబలం నువ్వు ఎరగక పోవడం వల్ల అలా మాట్లాడుతున్నావు. నాకంటే బలవంతులైన సోదరులు నలుగురు ఈ ఊరిలోనే ఉన్నారు. వారితో కలిసి వెళ్లి, ఇప్పుడే ఈ రాజ్యాన్ని కైవసం చేసుకుంటాను" అంటూ బయల్దేరాడు.

అతనికి దారిమధ్యలో మయూరధ్వజుడు ఎదురుపడ్డాడు.

"చిత్రభానూ! ఎలా ఉన్నావూ?!" అని పలకరించాడు.

"అన్నయ్యా! మనకీ దేశపు రాజుతో కయ్యం వచ్చింది. పద!" అంటూ.. మయూరధ్వజుణ్ని బయల్దేరదీశాడు.

వాళ్లకు దారిమధ్యలో పుష్పకేతుడు, పింగళుడు కనిపించారు. అన్నదమ్ములందరూ ఆప్యాయతలు పంచుకున్నారు. మణిమంతుడు కంగారుపడుతూ వెనకే వచ్చాడు. పుష్పకేతుడు అతణ్ని చూసి..

"సెట్టీ! నీ అదృష్టం పండింది. చక్రవర్తి కుమారుణ్నే అల్లుణ్ని చేసుకున్నావు. సోదరులారా! పదండి. కోటకు పోదాం" అన్నాడు.

నలుగురూ వెళ్తుండగా.. దారిమధ్యలో సౌమ్యుడు కూడా కలిశాడు. విడిపోయిన అన్నదమ్ములు ఐదుగురూ యథాలాభంగా ఒకేరోజున కలుసుకోగలిగారు.

కోటకు వెళ్లిన తరువాత.. వాళ్లు ఒకరి కథలు ఒకరికి చెప్పుకొన్నారు. ముందుగా పుష్పకేతుడు తాను రత్నమకుటను ఓడించి రాజ్యాన్ని చేపట్టడం, పింగళుడి చెర విడిపించడం వరకు గల కథను చెప్పాడు.

చిత్రభానుడు తాను విచిత్ర రీతిలో మణిమంతుడికి అల్లుడు కావడం వెనుక గల కథను వివరించాడు.

ఇప్పుడు సౌమ్యుడు తన కథను ఇలా చెప్పాడు..

* * *

అన్నలారా! ఆనాడు నేను, పింగళుడు కలిసి వేశ్యావాటికకు వెళ్లాం. ఒక వీధిలో అతణ్ని వదిలేసి నేనొక్కడినే ముందుకు వెళ్లాను. నడివీధిలో కొందరు విటులు మాట్లాడుకుంటుంటే అక్కడే కూర్చుని ఆలకించాను.

"ఆ కుందమాల తల్లి వ్యాఘ్రముఖి ఎంతకాలమైనా